# నేడు హెంజేరు సిద్దేశ్వర స్వామి అగ్నిగుండం

**అమరాపురం ఫిబ్రవరి 27ప్రభాతవార్త**



మండల పరిధిలో పవిత్ర పుణ్యక్షేత్రమైన హేమావతి హెంజేరు సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా నేడు అగ్నిగుండం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు దేవదాయ శాఖ ఈవో బి. నరసింహరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ కే. కరేగౌడ్ లు తెలిపారు. .బ్రహ్మోత్సవాల సంద ర్భంగా విచ్చేసే భక్తులకు అన్ని వసతు లను ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ కరేగౌడ్ తెలిపారు. అదేవిధంగా గ్రామపంచాయతీ తరఫున పారిశుద్ధం మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తున్నట్లు సర్పంచ్ తిప్పేస్వామి, గ్రామ కార్యదర్శి నరేష్ బాబు తెలిపారు. అదేవిధం గా ఉత్సవాల సందర్భంగా వాహనాల పార్కింగ్ మరియు ఇతర వసతులపై సీనియర్ నాయకులు కుమార్ స్వామి గొల్లమారనపల్లి రామచంద్రప్ప జయకుమార్ శివకుమార్, ఓంకార్ స్వామి, కృష్ణమూర్తి తిమ్మన్న, రామచంద్రప్ప తదితరులు ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్సై ఇషాక్ బాషా బందోబస్తు పై ప్రత్యేక దృష్టి సారించారు. హెంజేరు సిద్దేశ్వర స్వామి అన్నదాసోహ సమితి ఆధ్వర్యంలో దాసోహ కేంద్రం నందు విచ్చేసి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు హేమావతి అశ్వత్ నారాయణ, సభ్యులు కుమార్ స్వామి తెలిపారు. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి దాసోహ కేంద్రానికి 50 సంచులు బియ్యాన్ని విరాళంగా అందజేసినట్లు వారు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక కౌంటర్ల ద్వారా అన్న ప్రసాదాన్ని భక్తులకు అందజేయనున్నట్లు అశ్వథ్ నారాయణ, కుమార్ స్వామిలుతెలిపారు.

# ఆదర్శ పాఠశాలలో 6వతరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

**అమరాపురం ఫిబ్రవరి 27ప్రభాతవార్త**


ప్రిన్సిపాల్ జి. ఓబుళపతి

మండల పరిధిలో అమరాపురం ఆదర్శ పాఠశాలలో 202526 విద్యా సంవత్సరానికిగాను 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా స్వీకరిస్తున్నట్లు ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ జి. ఓబుళపతి తెలిపారు. ప్రవేశ పరీక్ష లో ప్రతిభ మరియు రిజర్వేషన్ నిబంధనలు ఆధారంగా ఎంపిక చేయబడునని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకుప్రవేశ పరీక్షను ఏప్రిల్ 20వ తేదీ ఆదివారం అమరాపురం ఆదర్శ పాఠశాలలో ఉదయం 10 గంటల నుండి12గంటలవరకు నిర్వహించబడునని తెలిపారు.ప్రవేశ పరీక్ష రుసుములు ఓసీ,బీసీలు150రూ, ఎస్సీ,ఎస్టీలు 75రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులను నెట్ సెంటర్ ,మొబైల్ ,సిస్టంలద్వారాhttps://apms. apcfass.in లేదా,www.cse.ap.gov. inవెబ్ సైట్ తోఆన్లైన్ దరఖాస్తులను మార్చి 31 లోపు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థి ఫోటో,ఆధార్ నంబర్ లను తప్పక జత పరచాలన్నారు. పూర్తి వివరాల కోసం ఆదర్శ పాఠశాల కార్యాలయంలోపనివేళల్లోసంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.

# పోసాని అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం

## వైఎస్ఆర్సిపి అధికార ప్రతినిధి ఆనందరంగా రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆనందంగారెడ్డి

**మడకశిర టౌన్ ఫిబ్రవరి 27 ప్రభాతవార్త,**

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ అక్రమ అరెస్టులతో వేధింపులకు గురి చేస్తున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి పేర్కొన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో వైసిపి పార్టీ అధికార ప్రతినిధి ఆనందంగా రెడ్డి మాట్లాడుతూ పోసాని కృష్ణమురళి అక్రమఅరెస్టు ఖండిస్తున్నామని పేర్కొన్నారు. న్యాయస్థానం అనేకమార్లు బి.ఎన్.ఎస్111 సెక్షన్లు వర్తించవని పేర్కొన్నప్పటి కీ కూడా ఆ వ్యవస్థలను కూడా పట్టించుకోకుండా అవే సెక్షన్ల తో అక్రమ కేసు లు నమోదుచేసి ప్రతిపక్షపార్టీల నాయకులను కళాకారులను వేధిస్తూ న్యాయ వ్యవస్థ వ్యాఖ్యలను కూడా పట్టించుకోవడంలేదని ఆయన పేర్కొన్నారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో పండుగల కూడా జరుపుకోకుండా అరెస్టులతో ప్రజల మనోభావాలను కూడా కించపరుస్తూ ప్రభుత్వం వ్యవహరిస్తుందని, పోసాని రాజకీయాలకు దూరంగా ఉంటున్నానని ప్రకటించిన వెంటాడి వేధిస్తున్నారనీ పేర్కొన్నారు.

# మార్చి 3 నుంచి ఓపెన్ ఇంటర్ పరీక్షలు.

**కొత్తచెరువు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త**

శ్రీ సత్య సాయి జిల్లా సార్వత్రిక విద్యాపీఠం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి మూడో తేదీ నుంచి మార్చి 15 వరకు నిర్వహించబడతాయని డీఈవో జి కృష్ణప్ప ఓ ప్రకటనలో తెలిపారు అభ్యసకులకు సంబంధించిన హాల్ టికెట్లు సంబంధిత స్టడీ సెంటర్స్ నుంచి పొందవచ్చును మరియు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం వెబ్సైట్ https;//www.apopenschool.ap.gov.in నందు పొందపరచబడినవి అభ్యాసకులు నేరుగా హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవచ్చు డౌన్లోడ్ చేసుకున్న హాల్ టికెట్లపై ఏఐ సెంటర్ కోఆర్డినేటర్ తో సంతకం చేయించుకోవాలి, జిల్లా పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడమైనది అభ్యసకులకు ఏవైనా సమస్యలు ఉన్న ఎడల మొబైల్ నెంబర్ 9492588343 కి సంప్రదించండి.

# అర్బన్ హెల్త్ సెంటర్లను తనిఖీ చేసిన డీఎంఅండ్ హెచ్ఓ

**ధర్మవరం,ఫిబ్రవరి27,ప్రభాతవార్త**


శివానగర్ అర్బన్ హెల్త్ సెంటర్ ని తనిఖీ చేస్తున్న డీఎంఅండ్ హెచ్ ఓ ఫైరోజ్ భేగం

ధర్మవరంలోని అర్బన్ హెల్త్ సెంటర్లను గురువారం జిల్లా వైద్యాధికారి ఫైరోజేబేగం తనిఖీచేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి ఫైరోజ్బేగం కొత్తపేట, సాయినగర్, దుర్గానగర్, శివానగర్ గాంధీనగర్ అర్బన్ హెల్త్ సెంటర్లను తనిఖీ చేసి అందులో రికార్డులను, హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం ఎన్సీడీ 3.0 సర్వేపై ఆరాతీసి సకాలం లో వందశాతం పూర్తి చేయాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. అర్బన్ హెల్సెంటర్లలో మందులుస్టాక్ రికార్డులు, వ్యాధినిరోధక టీకాలు నిల్వలను పరిశీలించారు. ఓపీ సేవలపై కూడా ఆరాతీశారు. ఆస్పత్రికి వచ్చే రోగులను ఆప్యాయంగా మాట్లాడి వైద్యసేవలు అందించాలన్నారు. ఆమె వెంట డిప్యూటీ డిఎంఅండ్హెచ సెల్వియా" సాల్మాన్,వైద్యసిబ్బంది ఉన్నారు.

# అనాధాశ్రమంలో అన్నదానం

**గుత్తి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త**

గుత్తి పట్టణంలోని కొత్తూరులో వున్న స్వీట్ సేవియర్ ట్రస్ట్ అనాధాశ్రమంలో గురువారం మాకం రంగనాథ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తన కుమార్తె రవీనా పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన ఆశ్రమంలోని అనాధలు, చిన్నారులకు భోజన వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో గుత్తికోట సంరక్షణ సమితి అధ్యక్షులు విజయభాస్కర్చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

# భక్తజన సందోహం నడుమ వీరనారాయణస్వామి జాతర





చిత్రావతి నదిలో పూజలందుకుంటున్న రామాపురం ఎగువ గుడి వీరనారాయణస్వామి, రామాపురం వీరనారాయణస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు. , రామాపురం జాతరకు తరలివచ్చిన భక్తులు

**బత్తలపల్లి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త**

శివరాత్రి పర్వదినం అనంతరం మరుసటి దినం మండలంలోని రామాపురం గ్రామంలో నిర్వహించే వీరనారాయణస్వామి జాతర భక్త జన సందోహం నడుమ ఘనంగా నిర్వహించారు. గురువారం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సమీపంలోని చిత్రావతి నదిలోకి ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్లి అక్కడ ప్రత్యేకాలంకరణలు చేశారు. ఎగువగుడి అర్చకులు కప్పలఖి నరేంద్ర, రామప్ప, నారప్పలు దిగువగుడి అర్చకులు కప్పల నంద, నారాయణస్వామి, నాగన్న స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జాతరకు చుట్టు ప్రక్కల గ్రామాల రైతులు తమ ఎడ్లబండ్లను, ట్రాక్టర్లను రంగు కాగితాలతో అలంకరించుకుని ఊరేగింపుగా స్వామి వద్దకు చేరుకున్నారు. వీరనారాయణస్వామి చుట్టూ ప్రదక్షిణలు చేయడం ఆనవాయితీ స్వామికి కానుకలు సమర్పించారు. వీరనారాయణస్వామి ప్రధాన అర్చకులు కప్పల నరేంద్రకు, అత్యానందకు స్వామి (ఒళ్లోకి వచ్చి భవిష్యవాణిని భక్తులకు వినిపించారు. ఈ భవిష్యవాణిని వినడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రద్దగా వినడం జరుగుతుంది. స్వామి చెప్పిన భవిష్యవాణి ఈ ఏడాది చిన్నకుశాల, పెద్దకుశాలలో వర్షాలు బాగానే కురుస్తుందని, అయితే 25శాతం వంట చేతికందుతుందన్నారు. తెల్లపంట బాగా పండుతుందన్నారు. గొర్రెలకు, జీవాలకు కీడు తక్కువగా ఉంటుందన్నారు. మానవులకు కీడు ఎక్కువగా ఉంటుందన్నారు. దీనికి భయపడాల్సిన అవసరంలేదని కీడును కొద్దిమేరకు తగ్గిస్తానన్నారు. ఎవరి పనులు వారు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో రామభజనలు చేసుకుంటే బాగుంటుందన్నారు ఈ సందేశం ప్రతియేటా నిజమవుతోందంటూ భక్తులు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ జాతరలో పలు దుకాణాలు వెలిశాయి విరంజి కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో జాతరకు వచ్చిన ప్రజలు ఎండ బారిన పడకుండా దుజ్జిగ, మంచినీటి ప్యాకెట్లును కావేటి మల్లికార్జున. తలపనేని మురళి, రఫీలు పంపిణీ చేశారు. మండలంలోని గంటాపురం, మాల్యవంతం తదితర గ్రామాల్లో ఇన్నదాన కార్యక్రమాలను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎస్ఐఐ సోమశేఖర్ తమ సిబ్బందితో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండి సరస్వతి, ఎంపీటీసీ సభ్యురాలు బండి రమణమ్మ, ఉపసర్పంచ్ బండి సుజాత, మాజీ సర్పంచు కప్పల నారాయణస్వామి, నారప్ప లక్ష్మన్న, రామప్ప, లక్ష్మినారాయణ, కప్పల నారప్ప, పెద్దప్ప, ఎల్లప్ప, నాగన్న, కప్పల పెద్దప్ప, కప్పల సూర్యనారాయణ, వ్యాపారం పెద్దప్ప, ఆదినారాయణ. సోమశేఖర్, బండి వీరనారప్ప, ప్రకాష్, రాము, ఎల్లప్ప, సన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మల్లేశ్వర స్వామిని దర్శించుకున్న జడ్పిటిసి


మల్లేశ్వర స్వామి ఆశీర్వాదం తీసుకుంటున్న జడ్పిటిసి

**అగళి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త**

మహాశివరాత్రిని పురస్కరించుకుని మండల పరిధిలోని మధూడి గ్రామంలో వెలిసిన పురాతన మల్లేశ్వర స్వామి దేవాలయాన్ని జడ్పిటిసి ఉమేష్ దర్శించుకుని స్వామి వారి ఆశీస్సులను పొందారు. శివరాత్రి సమయాల్లో శివున్ని తలుచుకుంటే అంతా శుభం జరుగుతుందని, శివ అంటే మంగళకరమని అన్నారు. శివరాత్రిని పురస్కరించుకుని మల్లేశ్వరస్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. వీరి వెంట ఆయకట్టు సంఘం అధ్యక్షులు శ్రీధర్, నాయకులు హనుమంతరాయ, రమేష్, నగేష్ తదితరులు ఉన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన కాటి కోటేశ్వర స్వామి అగ్నిగుండ ప్రవేశం


శివనామ స్మరణతో మార్మోగిన ఇంద్రకీలా పర్వతం, భక్తజన సందోహంతో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

**తాడిమర్రి ఫిబ్రవరి 27 ప్రభాతవార్త**

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గత రెండు రోజులుగా అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్న శ్రీ కాటి కోటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ వేడుకల్లో భాగంగా గురువారం స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా ఆలయానికి తరలించి అగ్నిగుండ ప్రవేశం చేయించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అగ్నిగుండ ప్రవేశం సందర్భంగా ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. చిల్లవారిపల్లె గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో శివరాత్రి కాటి కోటేశ్వర బ్రహ్మోత్సవాలు ఘనంగా ఊరేగింపు తో ముగింపు పలికారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం జరిగిన గొడవలను దృష్టిలో పెట్టుకొని పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేపట్టారు. స్వామివారి అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమానికి ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ కాటి కోటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని గుడి కాపులందరూ సామరస్యంగా ఐకమత్యంతో కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించాలని అన్నారు. బ్రహ్మోత్సవాలను దిగ్విజయంగా నిర్వహించిన సత్యసాయి జిల్లా అధికారులకు అభినందనలు తెలిపారు.

# కన్నులపండువగా గుంతకల్లప్పస్వామి రథోత్సవం

**గుంతకల్లు, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త**

పట్టణంలోని పాత గుంతకల్లులో వెలసిన శ్రీగుంతకల్లప్ప (బీరప్ప)స్వామి రథోత్సవం గురువారం కన్నులపండవగా జరిగింది. రథంపై గుంతకల్లప్పస్వామి వారిని అందంగా కొలువుదీర్చి పట్టణ పురవీధుల గుండా రథాన్ని లాగారు. అనంతపురంనపార్లమెంట్ కురుబ సాధికార జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి ఇన్చార్జ్, ఎమ్మెల్యే సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి, మాజీ కౌన్సిలర్ అంజి, ఒబిసి రైల్వే గంగాధర్, కౌన్సిలర్ లింగన్న, జనసేన నాయకులు మణికంఠ, నాయకులు యుగంధర్, సాంబశివ, రాయల్ వెంకటేష్, తదితరులు రథోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని రథోత్సవాన్ని వీక్షించి మొక్కులు తీర్చుకున్నారు.


రథోత్సవంలో పాల్గొన్న టిడిపి నాయకులు, ఇతర ప్రముఖులు

# ప్రయాణీకులకు మెరుగైన వసతులు కల్పించండి

-అధికారులను ఆదేశించిన జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న

-ఉరవకొండలోని ఆర్టీసీ ప్రయాణీకుల ప్రాంగణం ఆకస్మిక తనిఖీ



ఉరవకొండలో ఆర్టీసీ ప్రమాణీకుల ప్రాంగణంలో ప్రయాణీకులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న

**ఉరవకొండ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త**


మరుగుదొడ్లను పరిశీలించి వస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న

ప్రయాణీకులకు మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం అసిస్టెంట్ కలెక్టర్ ఉరవకొండ పట్టణంలోని ప్రయాణీకుల ప్రాంగణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి పారిశుద్ధ్యం, తాగునీటి వసతి, ఇతరత్రా అంశాలపై ఆరా తీశారు. మరుగుదొడ్లను పరిశీలించి డిపో మేనేజర్ అంపన్న సబ్బందితో సమావేశమై వివిధ అంశాలపై చర్చించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఉరవకొండ తహశీల్దార్ ఎస్.మహబూబ్బాషా, ఆర్ఐ టి.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

# వైభవంగా జరుట్ల రామలింగేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం

- పోటెత్తిన భక్తజన సందోహం-భారీ పోలీస్ బందోబస్తు - రామలింగేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు





జరుట్ల రామలింగేశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవం కొనసాగుతున్న దృశ్యం, ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న అర్చకులు, ప్రత్యేక పూజలందుకొన్న జరుట్ల రామలింగేశ్వరుడు

**ఉరవకొండ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త**

వజ్రకరూరు మండలం దక్షిణ కాశీగా పిలువబడే జె.రాంపురం గ్రామంలో వెలసిన జరుట్ల రామలింగేశ్వరస్వామివారి బ్రహ్మ రథోత్సవం స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సరం మాఘ బహుళ చతుర్ధశి గురువారం సాయంత్రం అత్యంత వైభవంగా జరిగింది. మహా శివరాత్రి పర్వదినం బుధవారం రోజు నుండి ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా అదేరోజు రాత్రి 12 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కళ్యాణోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. గురువారం ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం రామలింగేశ్వరుడు, పార్వతీదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేకంగా వివిధ రకాల పూలతో అలంకరించిన రథంలో కొలువుదీర్చి పూజలు జరిపిన అనంతరం హరహర మహాదేవ శంభో శంకరా అంటూ భక్తులు రథాన్ని లాగారు. కాగా దేశంలోనే ఒక విశిష్టమైన స్థానం సంపాధించుకున్న ఆలయం కావడంతో ఉదయం నుండే వివిధ ప్రాంతాల నుండి భక్తులు పోటెత్తగా సాయంత్రానికి ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. కాగా రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిరుపాల్ యాదవ్, ఆలయ కార్యనిర్వహణ అధికారి అంగదాల క్రిష్ణయ్య, ఆలయ కమిటీ పెద్దలు, భక్తులు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# అమ్మవారి గుడికి సోలార్ లైట్లు అందచేసిన ఎల్ఐసి శ్రీనివాసులు

**గోరంట్ల, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త**


సోలార్లైట్లను అందచేస్తున్న దాత శ్రీనివాసులు

మండలంలోని మల్లాపల్లి గ్రామ పంచాయతీ గౌనివారిపల్లి గ్రామ సమీపంలో వున్న శ్రీ సాగ్రవాజులకొండ అక్కమ్మగార్ల కొండకు కదిరి డివిజన్ మేనేజర్ గోరంట్లకు చెందిన శ్రీనివాసులు సోలార్ లైట్లను అర్చకులు సుధాకర్కు అందచేశారు.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

**గుత్తి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త**


చికిత్స పొందుతున్న మహిళ

మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. బుక్కరాయసముద్రం మండలం కెకె అగ్రహారంకు చెందిన సరస్వతి, నరసయ్యలు కసాపురం వెళ్లి తిరిగి వస్తుండగా శ్రీపురం గ్రామ సమీపంలో వారు ప్రయాణిస్తున్న ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. మరొక సంఘటనలో తాడిపత్రికి చెందిన హరివిష్ణు హైదరాబాద్ నుండి కారులో తిరిగి వస్తుండగా పట్టణ శివారు ప్రాంతలంలో లారీ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన బాధితులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి

**గుత్తి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త**



నివాళులు అర్పిస్తున్న దృశ్యం

స్వాతంత్ర్య సమర యోధుడు చంద్రశేఖర్ ఆజాద్ ఆంగ్లేయులను ఎదురొడ్డి నిలిచి పోరాడిన యోధుడు అంటూ వక్తలు పేర్కొన్నారు. గురువారంన రాష్ట్ర పెన్షనర్ల కార్యాలయంలో ఆయన 94వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ప్రెసిడెంట్ స్వర్ణాంభ, కార్యదర్శి రామ్మోహన్, అదనపు కార్యదర్శి కుళ్లాయిబాబు, శామ్యూల్, షెక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యవసాయ కూలీ మృతి

-అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస

**ఉరవకొండ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త**


రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన హరిజన వన్నూరుస్వామి

మండల పరిధిలోని పెన్నహోబిళంవద్ద అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారిలో బుధవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మండల పరిధిలోని వ్యాలగిరిపల్లి గ్రామానికి చెందిన హరిజన వన్నూరుస్వామి (39) మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడి భార్య గీతమ్మ ఇచ్చిన పిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకొని శవ పరీక్షల అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి నలుగురు ఆడపిల్లలు సంతానమని సామాన్య వ్యవసాయ కూలీ కుటుంబం కాగా ఇంటికి పెద్దదిక్కు వన్నూరుస్వామి మృతితో ఆ కుటుంబ బోరున విలపిస్తోంది.

# దొంగతనం కేసులో మూడేళ్లు జైలు శిక్ష


**పుట్టపర్తి రూరల్ ఫిబ్రవరి 27 ప్రభాతవార్త**

ఇళ్లకు తాళాలు వేసిన విషయం గమనించి పగటి పూట దొంగతనాలు చేస్తున్న భీమినేనిఅమర్నాథ్నాయుడు అనేవ్యక్తికి పుట్టపర్తికోర్టు మూడేళ్లజైలు శిక్ష విధించింది. ముద్దాయి అమర్నాథ్కు డిసెంబర్ 25వ తేదీన నల్లమడ సిఐఇస్మాయిల్ అరెస్ట్చేసి అతనినుండి 650 గ్రాముల బంగారం ఆభరణాలు సీజ్ చేసి రిమాండ్ తరలించారు. ఇదే ముద్దాయికి గతంలో కదిరి కోర్టు ఒక్క సంవత్సరం జైలు శిక్ష విధించింది. 2024 నవంబర్లో కొత్తచెరువు పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనం కేసు నమోదు చేసి వీటన్నిటిపై గురువారం విచారణజరపగా కోర్టువారికి ఆధారాలు సాక్షాలనుసమర్పించినందున సాక్షదారులు పరిగణలోకి తీసుకొని ముద్దాయి అమర్నాథ్కు మూడు సమక్షరాలు జైలు శిక్ష విధించారు. ముద్దాయికి జైలు శిక్ష విధించడంలో బాధితులకు న్యాయం జరిగే విధంగా దర్యాప్తు చేపట్టిన సీఐ ఇస్మాయిల్ను, కోర్టు కానిస్టేబుల్ కృష్ణమాచారి చంద్రనాయక్ను ఉన్నతాధికారుల ప్రశంసించారు.

# ఘనంగా చంద్రశేఖర్ ఆజాద్ 94వ వర్ధంతి

- చిత్రపటానికి నివాళులర్పించిన ఎస్ఎఫ్ఐ నాయకులు

**ఉరవకొండ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త**


చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ 94వ వర్ధంతి గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉరవకొండ పట్టణంలో ఘనంగా జరిగింది. పట్టణంలోని ఎసీస బాలుర సంక్షేమ వసతి గృహంలో చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటంవద్ద పూలువేసి నాయకులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్, రాజ్గురు, సుఖదేవ్, పండిత్ రామ్ ప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్ సింగ్, ప్రేమ్ కిషన్ ఖన్నా, అష్ఫాకుల్లా ఖాన్ల సహచరుడిగా బ్రిటీషువారి గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన చంద్రశేఖర్ ఆజాద్ దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు నందు, నాయకులు తరుణ్, వెంకీ, వంశీ, ధనుంజయ, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

09ATP27_09ATP27.qxd 27-02-2025 PM 10:59 Page 1



# వైభవంగా శివరాత్రి వేడుకలు

బత్తలపల్లి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త



విశేష పూజలు నిర్వహించిన దృశ్యం

శివరాత్రి పండగ వేడుకలను మండలంలో వైభవంగా నిర్వహించారు. మండలంలోని పలు ఆలయాలలో శివనామస్మరణతో భక్తులు భజనలు చేశారు. మరోవైపు అన్నదాన కార్యక్రమాలు భక్తులు నిర్వహించారు. మండలంలోని బత్తలపల్లి. సంజీవపురం, ముష్టూరు, పోట్లమర్రి, గంటాపురం, డి.చెర్లోపల్లి, దంపెట్ల, రామాపురం, యర్రాయపల్లి, ఉప్పర్లపల్లి, లింగారెడ్డిపల్లి, కాటమకుంట, ముద్దనపల్లి, జలాలపురం, రాఘవంపల్లి, కోడేకండ్ల, మాల్యవంతం, సంఘమేశ్వర క్షేత్రం. కాటి కోటేశ్వరక్షేత్రంతోపాటు వివిధ గ్రామాలలోని ఆలయాల్లో బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు భక్తులు భజనలు నిర్వహించి జాగరణ చేశారు. సంఘమేశ్వరం. బత్తలపల్లి, సంగాల, రామాపురం, మాల్యవంతం గ్రామాల్లో నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేయడంతో భక్తులు వాటిని తిలకిస్తూ జాగారణ చేశారు. మండలంలోని అన్ని గ్రామాలలో భక్తుల కోలాహలం కనిపించింది. ఆయా గ్రామాలలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. పోట్లమర్రిలోని శివాలయంలో శివుడు, శివరాత్రి విశిష్టత గురించి భక్తులకు వివరించారు. కాటమకుంట గ్రామంలో వైఎస్సార్సీపీ నాయకులు సంకేపల్లి వద్ద జరిగే వీరనారాయణస్వామి పరుషను ఎద్దుల బండిని ప్రత్యేకంగా అలంకరించి తీసుకువెళ్లారు. భక్తులు కోలాహలంతో సందడి నెలకొంది. బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

# ఢీకొన్న ఐచర్ వాహనం 30 గొర్రెలు మృతి

బత్తలపల్లి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త



మృత్యువాత పడిన గొర్రెలు

అనంతపురంకదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని తంబాపురం కుంట వద్ద గురువారం సాయంత్రం రోడ్డు దాటుకుంటున్న గొర్రెలపైకి ఐచర్ వాహ నం దూసుకుపోవడం తో 30 జీవాలు అక్కడికక్కడే మృత్యువాత పడగా, మరో ఐదు జీవాలకు తీవ్రగాయాలయ్యా యి. గొర్రెల కాపరి తెలిపిన సమాచారం మేరకు" వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మవరం మండలం తిప్పేపల్లి గ్రామానికి చెందిన నారాయణస్వామి గొర్రెల మందను తీసుకుని గొర్రెల కాపరి మేపులకు తీసుకొని వచ్చాడు. మేపులు అనంతరం నీటిని తాపించేందుకు తంబాపురం సమీపంలోని కుంట వద్దకు జీవాలను రోడ్డు దాటిస్తున్నాడు. ఇంతలో కదిరి వైపు నుంచి బత్తలపల్లికి వస్తున్న ఐదర్ వాహనం వేగంగా వచ్చి గొర్రెల మందపైకి దూసుకుపో యింది. ఈ ప్రమాదంలో 30 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో ఐదు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ప్రమాదానికి కారణమైన ఐచర్ వాహనం ఆపకుండా వేగంగా వెళ్లిపోయింది. అయితే కాపరి ధైర్యం చేసి బత్తలపల్లి వైపు వెలుతున్న ఓ ప్రయాణికుని ద్విచక్రవాహనంలో వెళ్లి గుమ్మల్లకుంట సమీపంలోని టోల్గేటు వద్ద స్థానికుల సహకారంతో ఐచర్ వాహనాన్ని నిలిపి, పోలీస్ స్టేషన్లో వాహనాన్ని అప్పగించారు. పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు. సంఘటనాస్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను ఆరా తీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా బత్తలపల్లి ప్రాంతీయ పశుసంవర్ధక శాఖ అధికారులు శ్రీనివాసులు, గుర్నదరెడ్డిల ఆదేశాల మేరకు పశు వైద్య సిబ్బంది ప్రమాదస్థలానికి చేరుకుని గాయపడిన గొర్రెలకు టీకాలు అందించారు. ప్రమాదంలో జీవాలు మృతి చెందిన విషయాన్ని కాపరి తమ యజమానికి తెలియజేశాడు.

# పూర్వ విద్యార్థులచే అగ్నిగుండమునకు నెయ్యి కర్పూరం వితరణ

అమరాపురం ఫిబ్రవరి 27 ప్రభాతవార్త



నెయ్యి కర్పూరం అందజేస్తున్న పూర్వ విద్యార్థుల దృశ్యం

మండల పరిధిలో హేమావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో1981 82 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు ఆర్యవైశ్య సెక్రెటరీ ఈ.ప్రకాష్, ప్రొఫెసర్ ఎన్ శశిధర్, బెంగళూరులో న్యాయవాది అశ్వత్ రెడ్డి, ఇంజనీర్ మురళీధర్ తదితరులు సిద్దేశ్వర స్వామి అగ్నిగుండంనకు 30 కేజీల నెయ్యి మరియు ఐదు కేజీల కర్పూరం మరియు అగ్నిగుండమునకు అలంకారం కోసం పూలను విరాళంగా అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆలయ కమిటీ ఛైర్మన్ ప్రకాష్, ఉపాధ్యాయుడు తిప్పేస్వామి మరియు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా జంబణ్ణ తాత రథోత్సవం



భక్తుల కోలాహల మధ్య కదులుతున్న స్వామి వారి రథోత్సవం

డి.హిరేహాళ్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త

మహాశివరాత్రి పర్వదినం వేడుకల్లో భాగంగా జంబన్న తాత రథోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. గురువారం డి.హిరేహాళ్ మండలం పులకుర్తి గ్రామంలో శ్రీ సద్గురు జంబణ్ణ తాత రథోత్సవం ప్రతి ఏటా ఆనవాయితీగా మహాశివరాత్రి మరుసటి రోజు జరుపుకునే రథోత్సవ వేడుకలను భక్తుల కోలహల మధ్య ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా రెండు రోజులపాటు నిర్వహించే వేడుకల్లో భాగంగా మొదటిరోజు ఆలయ ప్రధానార్చకులు కె హెచ్ ఎం మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఆలయంలో హోమం అనంతరం స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు లాంటి ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవ వేడుకల్లో భాగంగా సాయంకాలం ప్రత్యేకంగా స్వామివారి పల్లకి సేవ నిర్వహించి స్వామివారి ఆలయ ప్రాంగణంలో భక్తులు భజన లాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రథోత్సవం వేడుకలను పురస్కరించుకొని వేకువ జామునే ఆలయంలో స్వామివారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాల అనంతరం భక్తులు స్వామివారి రథోత్సవ అలంకరణలో పాల్గొన్నారు. సద్గురు శ్రీజంబణ్ణ తాత తేరును డప్పులు, మంగళవాయిద్యాల తో భక్తజన సందోహం, కోలాహలం మధ్యకన్నుల పండువగా స్వామివారి రథోత్సవం సాగింది. ఈ వేడుకల్లో సరిహద్దున ఉన్న ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు తీర్చికొన్నారు. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్.ఐ.గురుప్రసాద్ రెడ్డి తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

# వంద మందితో బ్రహ్మోత్సవాల్లో గట్టి బందోబస్తు



బందోబస్తు పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అమరాపురం ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

హేమావతి హెంజేరు సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్స వాల్లో సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న మరియు పెనుగొం డ డిఎస్పి వెంక టేశ్వర్లు ఆదేశాల మేరకు వంద మంది సిబ్బందితో గట్టి బందోబస్తును ఏర్పాటు చేసినట్లు మడకశిర సిఐ రాజకుమార్ తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో ఒక డిఎస్పీ తో పాటు ముగ్గురు సీఐలు 6 మంది ఎస్ఐలతో పాటు 100 మంది పోలీస్ కానిస్టేబుల్ లతో గట్టి బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఆయనతెలిపారు. స్పెషల్పార్టీ పోలీసులుకూడా బ్రహ్మోత్సవాల్లో బందోబస్తు ను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు కూడా పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

# రైతుల సదస్సులను విజయవంతం చేయండి

అగళి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

మార్చి 3న జరిగే రైతుల సదస్సును విజయవంతం చేయాలని రైతు సంఘం ఎగ్జిక్యూటివ్ మెంబర్ కల్లప్ప కోరారు. శ్రీ కంచి కామాక్షి కళ్యాణమంటపం పరిగి రోడ్డు హిందూపురంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. ముఖ్యంగా హంద్రీనీవా ప్రాజెక్టుకు 40 టిఎంసీల నికర జలాలు కేటాయించాలి, పాడి, పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలని పలు డిమాండ్లతో ఈ సదస్సు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల కన్వీనర్ వడ్డే శోభనాదీశ్వరరావు ముఖ్య ఉపన్యాసకులుగా అఖిల భారత, ఏఐకెకెఎంఎస్ ప్రధాన కార్యదర్శి శంకర్గోస్ రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకం

బత్తలపల్లి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త



విత్తనశుద్ధి చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది.

ప్రకృతి వ్యవ సాయంతో రైతులకు ఖర్చులు లేకుండా లాభదాయకంగా ఉంటుందని ఏపి సిఎన్యఫ్ పోగ్రాం. మేనేజర్ డాక్టర్ నవీన్ పేర్కొన్నారు. గురువారం మండ లంలోని రాఘవం పల్లి గ్రామంలోని నాగరాజు మామిడి తోటలో రెండు ఎకరాలలో పీఎండీఎస్ ఐదు రకాల ప్రధాన పంటలు, 20 రకాల జీవ వైవిధ్య పంటలు విత్తనాలను బీజామృతంతో విత్తనశుద్ధి చేసి ఘనజీవామృతంతో పాటు విత్తటం జరిగింది. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ ఈ పద్ధతిలో అనుములు, కంది. సజ్జ, గోరుచిక్కుడు, ఆముదం విత్తనాలతో పాటు 20 రకాల బయోడైవర్సిటి విత్తనాలను కలిపి ప్రధాన పంటలతో చేయడం వల్ల జీవవైవిధ్యం పెరుగుతుందన్నారు. 365 రోజులు బహుళ పంటలతో సాగు సాధ్యమవుతుందన్నారు. నేలలో సేంద్రీయ కర్బన్ శాతం పెరుగుతుందన్నారు. వివిధ పంటల పేర్లు భూమిలో వివిధ రకాల సూక్ష్మజీవులు వృద్ధి చెంది. ప్రధాన పంటకు కావలసిన అన్ని పోషకాలు లభిస్తాయన్నారు. బహుళ పంటల వలన కలుపు ఉండదని, నేలకోతకు గురికాదన్నారు. ప్రధానపంట వాతావరణ వైపరీత్యాలకు తట్టుకునే సామర్థం పెరుగుతుందన్నారు. నేల గుల్లబారి వానపాములు వృద్ధి చెందుతాయన్నారు. ప్రధాన పంటల చీడపీడలు, తెగుళ్లను తట్టురునే సామర్థం పెరుగుతుందన్నారు. ప్రకృతివ్యవసాయం రైతుకి లాభసాటిగానూ, ఖర్చులు లేకుండా రైతులకు లాభదాయకంగాను ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ నరసింహులు, ఆదినారాయణ, సాకే గంగమ్మ, వెంకటేష్, అశ్విని, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెల యజమానికి ఆర్థిక సాయం అందించండి- ఇన్చార్జి హరీష్ బాబు

బత్తలపల్లి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త



సంఘటనా స్థలంలో గొర్రెల యజమానితో మాట్లాడుతున్న మంత్రి కార్యాలయ ఇన్చార్జ్

రోడ్డు ప్రమాదం కారణంగా గొర్రెలు చనిపోవడంతో తీవ్రంగా నష్టపోయిన గొర్రెల యజ మాని నారాయణ స్వామికి ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కార్యాల యం ఇన్చార్జి హరీష్ బాబు అధికారులను ఆదేశించారు. తిప్పేపల్లి గ్రామానికి చెందిన అరివేటి నారాయణస్వామి గొర్రెల మందపై ఐచర్ వాహనం దూసుకెళ్లడంతో 27 గొర్రెలు మృతి చెందాయి. అనంతపురంచెన్నై జాతీయ రహదారిలోని తంబాపురం సమీపంలో ఐచర్ వాహనం దూసుకెళ్లడంతో 27 గొర్రెలు మృతి చెందాయి. ఈ విషాదకర సంఘటనను తెలుసుకున్న మంత్రి గారి నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్బాబు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా, హరీష్ బాబు గారు పోలీస్ అధికారులతో మాట్లాడి ప్రమాదం జరిగిన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం, అనిమల్ హస్బండ్రీ జెడి, ఆర్డీవోలతో చర్చించి గొర్రెల యజమాని అరివేటి నారాయణ స్వామికి తగిన సహాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గొర్రెల యజమాని అరివేటి నారాయణ స్వామి ఈ ప్రమాదంలో తన గొర్రెలు కోల్పోయి తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని వీలైనంత త్వరగా సహాయం అందించడం అత్యవసరమని చెప్పారు. హరీష్ బాబు ఈ విషాద ఘటనపై తీవ్ర విచారాన్ని వ్యక్తం చేస్తూ, నారాయణ స్వామికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, నష్టాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ సంఘటనపై పూర్తి విచారణ కొనసాగించాలని పోలీసు అధికారులను కోరారు.

# ఆమిద్యాలలో వైభవంగా రామలింగేశ్వరస్వామి రథోత్సవం

- చుట్టుప్రక్కల గ్రామాల నుండి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు
- కొనసాగిన రుద్రాభిషేకం, దాతల సహకారంతో అన్నదానం

ఉరవకొండ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త



గ్రామంలో రామలింగేశ్వరస్వామి రథోత్సవం జరుగుతున్న దృశ్యం



రథంలో కొలువుదీర్చిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఉత్సవమూర్తులు



ప్రత్యేకాలంకరణలో రామలింగేశ్వరస్వామి మూలవిరాట్

మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామంలో వెలసిన రామలింగ్వేరస్వామి రథోత్సవం స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సరం బహుళ చతుర్దశి గురువారం సాయంత్రం వైభవంగా జరిగింది. మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం ప్రత్యేకంగా ముస్తాబు చేసిన రథంలో మేళతాళాల మధ్య పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులను కొలువుదీర్చి శంభో శంకర అంటూ భక్తులు రథాన్ని లాగారు. ఆమిద్యాల చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు. రథోత్సవం సందర్భంగా ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, బిల్వార్చన, శాంతి పూజ, వాస్తు, గణపతి, నవగ్రహా, రుద్ర, జయ్యాది హోమాలు, మహా మంగళహారతి కార్యక్రమాలు కొనసాగాయి. మధ్యాన్నం దాతల సహకారంలో అన్నదాత కార్యక్రమం కొనసాగింది.

# వైభవంగా సిద్దేశ్వరస్వామి రథోత్సవం

- కన్నుల పండువగా పార్వతి పరమేశ్వరుల కళ్యాణం



భక్తజన సందోహం మధ్య కొనసాగుతున్న సిద్దేశ్వరస్వామి రథోత్సవం

ఉరవకొండ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త



ప్రత్యేక పూజలందుకుంటున్న సిద్దేశ్వరస్వామి

మండల పరిధిలోని పెద్దముష్టూరు గ్రామంలో వెలసిన సిద్దేశ్వరస్వామివారి బ్రహ్మ రథోత్సవం స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సరం మాఘ బహుళ చతుర్దశి గురువారం సాయంత్రం నేత్రపర్వంగా జరిగింది. గ్రామంలోని అతి పూరాతనమైన చాళుక్యుల కాలం దాదాపు 1,000 సంవత్సరాల క్రితం సిద్దేశ్వరాలయం నిర్మించిన విషయం తెలిసిందే. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం 6 గంటలకు ప్రత్యేకంగా అలంకరించిన పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు, దాతలు, భక్తులు సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రథంలో ప్రతిష్టించిన అనంతరం హరహర మహాదేవ శంభో శంకరా అంటూ భక్తులు రథాన్ని లాగి ఆలయం చుట్టూ ఐదుసార్లు ప్రదక్షిణలు చేసి భక్తిప్రవర్తలను చాటుకొన్నారు. రథోత్సవ కార్యక్రమంలో సర్పంచ్ సరస్వతి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులతోపాటు చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కాగా శుక్రవారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా అర్ధరాత్రి దాటిన తరువాత పార్వతీ పరమేశ్వరుల కళ్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# నాటు సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు

- లత్తవరం తండాలో నిర్వహించిన నవోదయం కార్యక్రమంలో ఎక్షైజ్ సీఐ ఆర్.రవిచంద్ర

ఉరవకొండ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త



గ్రామస్థులతో కలిసి పోస్టర్లు విడుదల చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

నాటు సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ప్రొహిబి షన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఆర్.రవి చంద్ర అన్నారు. మండల పరిధిలోని లత్తవరం తండా గ్రామం లోని పాఠశాల ఆవరణంలో గురువారం సాయంత్రం గ్రామ సర్పంచ్ అన్నపూర్ణమ్మ అధ్యక్షతన నవోదయం కార్యక్రమం నిర్వహించిన గ్రామస్థులకు నాటుసారా వల్ల కలిగే దుష్ప్రభావాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ ఆర్.రవిచంద్ర మాట్లాడుతూ నాటుసారా నిర్మూలనకు రెవెన్యూ, పోలీస్, గ్రామ పెద్దలు, యువత, మహిళల సహకారంతో కృషి చేస్తున్నామన్నారు. గ్రామంలోని పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందన్నారు. గ్రామంలో ఎవరైనా నాటుసారా తయారు చేసినా, అలాంటి వారికి బెల్లం, ఇతరత్రా వస్తువులను సరఫరా చేసినా సమాచారం అందించాలని సమావేశం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. సారాను పూర్తిగా వదిలేసి ఆరోగ్యంగా ఉంటూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని కుటుంబాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నవోదయం పోస్టర్లను గ్రామస్థులతో కలిసి ఆవిష్కరించి కో ఆర్డినేషన్ కమిటీను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఓ షేక్షావలి, ఎక్సైజ్ ఎస్ఐ పోతులయ్య సిబ్బంది పాల్గొన్నారు.

# మార్చి 8న గిరిజన పండగ వేడుకలు

- అదనపు జిల్లాధికారి మహ్మద్జుబేర్



మాట్లాడుతున్న అదనపు జిల్లాధికారి మహ్మద్జుబేర్

బళ్లారి, ఫిబ్రవరి27, ప్రభాతవార్త;

జిల్లాలో మార్చి 8న నిర్వహించనున్న గిరిజనోత్సవాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా చక్కగా నిర్వహించేందుకు అవసరమైన సన్నాహాలు చేయాలని జిల్లా అదనపు జిల్లాధికారి మహ్మద్జుబేర్ తెలిపారు. శుక్రవారం నగర జిల్లాధికారి కార్యాలయ హాలులో ఏర్పాటు చేసిన గిరిజనోత్సవాల కార్యక్రమం ముందస్తు సన్నాహక సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. గిరిజనుల పండగ కార్యక్రమాన్ని మార్చి 8న ఉదయం 9 గంటలకు నగరంలోని మున్సిపల్ కాళాశాల మైదానంలో నిర్వహించనున్నారు. గిరిజనుల పండగ ఆహ్వాన పత్రికలను మర్యాద నియమావళి ప్రకారం ముద్రించి ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు అందజేయాలన్నారు. కార్యక్రమాన్ని అర్థవంతంగా జరుపుకునేందుకు వివిధశాఖలు సమన్వయంతో పనిచేసి గిరిజనులు జరుపుకోవాలన్నారు. వివిధ శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. గిరిజన పండగ వేడుకలకు సంబంధించి రిసెప్షన్, మర్యాదలు, ఆహ్వాన పత్రికలతో పాటు వివిధ కమిటీలు, వేదిక కమిటీ, సాంస్కృతిక కార్యక్రమాల కమిటీని ఏర్పాటు చేసి ఆయా కమిటీలోని అధికారులు తమకు అప్పగించిన పనులను చక్కగా నిర్వహించాలన్నారు. గిరిజనుల పండగ కార్యక్రమం నిర్వహించే మున్సిపల్ కళాశాల మైదానం ఆవరణను శుభ్రం చేయాలని, తాగునీటి వ్యవస్థతో పాటు ప్రముఖులు కూర్చుకునేందుకు భోజన, సీట్లు ఏర్పాటు చేయాలని మహానగర పాలక సంస్థ కమిషనర్ ఆదేశించారు. గిరిజన ఉత్సవాలను క్రమపద్ధతిలో నిర్వహించేందుకు పోలీసుశాఖ చర్యలు తీసుకోవాలని, ఇందుకు అవసరమైన సన్నాహాలు చేయాలని సూచించారు.

# జిందాల్లో మూడు రోజుల భారీ రక్తదాన శిబిరం విజయవంతం

- 5034 యూనిట్ల రక్త సేకరణ రికార్డు
- జిల్లాధికారి ప్రశాంత్కుమార్ మిశ్రా

బళ్లారి, ఫిబ్రవరి27, ప్రభాతవార్త;



మాట్లాడుతున్న జిల్లాధికారి ప్రశాంత్కుమార్ మిశ్రా

ఫిబ్రవరి 20, 21, 22వ తేదీల్లో మూడు రోజులపాటు సండూరులోని తోరణగల్లు సమీపంలోని జిందాల్లో నిర్వహించిన భారీ రక్తదాన శిబిరం విజయవంతమై మొత్తం 5034 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు జిల్లాధికారి ప్రశాంత్కుమార్ మిశ్రా గురువారం తెలిపారు. బృహత్తర రక్తదాన శిబిరం విజయవంతమయ్యిందని, జిల్లాలోని అన్ని బ్లడ్ బ్యాంకుల్లో రక్తం అవసరమైన వారికి రక్తం అందేలా చేయూతనందించే దిశలో స్వచ్ఛందంగా రక్తదానం చేస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలిచిన రక్తదాతలను, జిల్లాలో రక్త కొరతను అధిగమించేందుకు సహకరించిన ప్రతిఒక్కరినీ అభినందించారు. జేఎస్డబ్ల్యూ ఫౌండేషన్, జిందాల్ స్టీల్ పూర్తి సహకారంతో జిల్లా పరిపాలన, జిల్లా పంచాయతీ, జిల్లా ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మరియు నిర్వహణ యూనిట్ సహకారంతో ఫిబ్రవరి 20 నుంచి 22వ తేదీ వరకు మూడు రోజులపాటు 5 వేల యూనిట్లు (5 వేల మంది వ్యక్తుల నుంచి రక్త సేకరణ) రక్త సేకరణ లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. జిందాల్ అధికారులు, సిబ్బంది ఫౌండేషన్లో పనిచేస్తున్న వ్యక్తులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయడంతో తొలిరోజు 1454 యూనిట్లు, రెండో రోజు 1377 యూనిట్లు, మూడో రోజు 2203 యూనిట్లు సేకరించడం సాధ్యపడుతుందనడానికి నిదర్శనమన్నారు. ఇంత భారీ లక్ష్యాన్ని సాల్గా స్వీకరిస్తూ జిందాల్ స్టీల్ ప్రెసిడెంట్ పి.కె.మురుగన్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (పరిపాలన) సునీల్ రాల్ ఫ్, సీఎస్ఆర్ హెడ్ పెద్దన్న, సంజీవిని హాస్పిటల్ హెడ్ డా.సన్నీ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమాధికారి డాక్టర్ యాళ్ల రమేష్బాబు, జిల్లా క్షయవ్యాధి నిర్మూలనాధికారి డాపో పీపుల్ డా. 200 మంది టెక్నీషియన్లతో కష్టపడి పనిచేసిన 9 బ్లడ్ బ్యాంకులను ఆయన అభినందించారు.

# నేడు జాతీయ సైన్స్డే కార్యక్రమం

బళ్లారి, ఫిబ్రవరి27(ప్రభాతవార్త);

కర్ణాటక స్టేట్ సైనస అండ్ టెక్నాలజీ బోర్డు మరియు జిల్లా పంచాయతీ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన ఉదయం 10;30 గంటలకు బళ్లారి తాలూకాలోని మోకా గ్రామంలోని కర్ణాటక పబ్లిక్ స్కూల్లో జాతీయ సైన్స్డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి మహమ్మద్హరీష్సుమేర్ తెలిపారు. మోకా గ్రామం కర్ణాటక పబ్లిక్ స్కూల్ (హయ్యర్ సెక్షన్) వైస్ ప్రిన్సిపాల్ బి.భారతి అధ్యక్షత వహించనున్నారు. జిల్లా పంచాయతీ ముఖ్య ప్రణాళిక అధికారి వాగీష్ శివాచార్య ఎస్ఎం, పాఠశాల విద్యాశాఖ ఉప సంచాలకులు బి.ఉమాదేవి, క్షేత్ర విద్యాశఖాధికారి నయూమూర్ రహమాన్ కెఎస్, పాఠశాల విద్యాశాఖ ఉప సంచాలకులు కార్యాలయ గణిత సబ్జెక్టు మేనేజర్ బసవరాజు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. రిసోర్స్ పర్సన్లుగా సిందవాల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు హెచ్.పీఆర్బాషా, మోకా గ్రామ కర్ణాటక పబ్లిక్ స్కూల్ (హయ్యర్ సెక్షన్) ఉపాధ్యాయుడు ఎస్.ఎం.హీరేమఠ్, జిల్లా ప్లానింగ్ కో-ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి జి.బి.తోపాటు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు హాజరుకానున్నారు.

# ఫోక్సో కేసు నమోదు

అగళి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

మండల పరిధిలోని జంగమరపల్లి గ్రామానికి చెందిన 17 సంవత్సరాల వయస్సుగల బాలిక తప్పిపోయిన విషయంలో ఆమె తల్లి ఫిర్యాదు మేరకు ఈ నెల 14న అగళి పోలీస్స్టేషన్లో బాలిక మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరేష్ తెలిపారు. సదరు తప్పిపోయిన అమ్మాయిని వెతికి పట్టుకోగా మైనర్ బాలికను ప్రేమ పేరుతో ఎత్తుకెళ్లిన మడకశిర పట్టణానికి చెందిన మధు అనే వ్యక్తిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరేష్ తెలిపారు. మైనర్బాలికను మాయమాటలు చెప్పి తీసుకెళ్లిన మధుపై ఫోక్సో కేసు నమోదు చేసి గురువారం మడకశిర జేఎఫ్పిఎం కోర్టుకు హాజరు పర్చగా కోర్టు వారు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు. బాలికల విషయాల్లో యువత ఆవేశ పడి వ్యవహరిస్తే ఇబ్బందులకు గురవుతారని ఎస్ఐ ఈ సందర్భంగా హెచ్చరించారు.

